ఆమె నెమ్మదిగా మహదేవ్ బెడ్ దగ్గరికి వెళ్ళి అతని పక్కనే కూర్చుండిపోయింది.

ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోని వాళ్ళిద్దరికేసి చూసిన తిరుపతి తనకు తెలిసింది వాళ్ళిద్దరికి మాత్రమే వినపడేలా చెప్పడం ప్రారంభించాడు.

"ఆమె తన భావ తరంగాల ఆధారంగా మహదేవ్ పరిస్థితిని తెలుసుకుంది. ఇదేమీ అద్భుతమైన విద్యాకాదు, మేజిక్ అంతకంటే కాదు.

ప్రతి వ్యక్తి జీవితంలోనూ కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు జరుగుతుంటాయి. ఎంత ఆలోచించినా అలా ఎందుకు జరుగుతాయో వారికి అర్థం కాదు. దాంతో "ఏదోలే" అనుకుని వూరుకుండిపోతారు.

మనం ఒక వ్యక్తి గురించి ఆలోచిస్తూ వుంటాము. అదే క్షణంలో అతను మన ఇంటికి రావటం జరుగుతుంది. అది యాదృచ్ఛికంగా జరిగిందనుకుని 'నీకు నూరేళ్ళు ఆయుష్షురా' అనేసి అంతటితో విషయాన్ని మర్చిపోతాం.

మరొకసారి ఎన్నో వందలమైళ్ళ దూరంలో వున్న ఆత్మీయుల గురించి మనం ఆలోచిస్తుండగా అతని నుంచి ఉత్తరమో, ఫోనో రావటం జరుగుతుంది.

ఈ సంఘటనలను జాగ్రత్తగా పరిశీలించి చూస్తే ఇవి కేవలం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలు కావని అనిపిస్తుంది.

డ్యూక్ యూనివర్శిటీకి చెందిన ప్రముఖ పారా సైకాలజీ డాక్టర్ జె.బి. రైనే ఈ విషయంలో కూలంకషంగా పరిశోధనలు కావనీ, ఈ సంఘటనలు జరగటానికి కారణం మనలోని భావ తరంగాలేనని రుజువు చేసి చూపాడు.

టెలిపతికి సంబంధించి ఎన్నో పరిశోధనలు చేసిన రైనే ఒకసారి ప్రముఖుల సమక్షంలో ఇద్దరు వ్యక్తుల్ని తీసుకొచ్చి - వారిలో ఒకరిని ఒక గదిలో, ఇంకొకరిని మరో గదిలో వుంచారు.

ప్రముఖులలో సగంమంది మొదటి వ్యక్తితోనూ, మిగతా సగం మంది రెండో వ్యక్తితోనూ వుండగా మొదటి గదిలో వున్న ప్రముఖులు ఆ గదిలోని వ్యక్తికి ఒక బొమ్మని చూపిస్తూ వున్నారు.

అదే సమయంలో రెండవ గదిలో వున్న వ్యక్తి మొదటి గదిలోని వ్యక్తి భావాలను అందుకుంటూ ఒక పేపరు మీద గీతలు గీస్తున్నాడు. రెండు నిమిషాల తర్వాత బొమ్మ తయారయింది. అది అచ్చు మొదటి గదిలోని ప్రముఖులు స్వయంగా తీసుకొచ్చి ఆ గదిలోని వ్యక్తికి చూపించినట్టే వుంది.

ఆ విధంగా భావప్రసారాల ప్రదర్శన చేసి- టెలిపతీలో రికార్డులు బద్దలుకొట్టి నూతన అధ్యాయం సృష్టించారు జె.వి. రైనే.

దీనికి కారణం మాయామంత్రాలు కానే కాదు. మనలో చాలామందికి చాలాసార్లు ఇటువంటి అనుభవాలు జరిగే వుంటాయి. మనం ఎక్కువ ఇష్టపడే వ్యక్తుల్ని గురించి ఆలోచించటం, వారియందే మన మనస్సు నిలిపివుంచటంవల్ల భావప్రసారం తరంగాల

రూపంలో పయనించి అవతలివ్యక్తి గురించి మనకి తెలియకుండానే తడుతుంది.

ఒకరికి ప్రమాదం సంభవించిన బాధపడుతుంటే ఆ సంగతి హృదయానికి తెల్సి మనకి తెలియకుండానే మన మనసులో ఏదో చెప్పలేని బాధకలగటం వంటివి జరుగుతాయి. అవి రుజువుచేసి చూపారు రైన్."

తిరుపతి దృష్టి అప్రయత్నంగా ఆమె వైపు తిరిగింది. కనులముందే కావలసినవారిని కోల్పోతున్నట్టు ధారాపాతంగా వర్షిస్తున్న కళ్ళు, కవులచే కావ్యాలు రాయించగలిగే ఆ అందమైన కళ్ళు భయంతో, బాధతో స్థిమితం కోల్పోయి చంచలమై ఏ అదృశ్య హస్తాన్నో రక్షించమన్నట్టు చలిస్తున్నాయి. నలుదిక్కులా తదేక దీక్షతో శోధిస్తూ.

ఆమెనా స్థితిలో చూసి తిరుపతి చలించిపోయాడు. మహదేవ్‌ని ఎలాగైనా కాపాడి, మనస్విని తేరుకునేలా చేయాలనే ఆలోచనల్లోకెళ్ళి పోయాడు.

*  *  *  *  *

సమయం సాయంత్రం నాలుగ్గంటలు!

మహదేవ్ కట్టెలా కదలకుండా పడివున్నాడు. అభిరాం, వరప్రసాదం, మనస్వినిల మొహాలు బాధలకి చిరునామాల్లా దైన్యంగా వున్నాయి.

తిరుపతి గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

"తను మరికొద్దిసేపట్లో వీళ్ళందర్నీ వదిలి వెళ్ళిపోవాలి-- బాధగా మహదేవ్‌నే చూస్తున్న అభిరాం, ఏ క్షణంలోనైనా తమని మహదేవ్ కులాసాగా పలకరిస్తాడన్నట్టు ఆశపడుతూ అతని ప్రతి కదలికనీ వీక్షిస్తున్న వరప్రసాదం, అనంతానంత విశ్వంలోంచి ఏ దివ్యశక్తో వచ్చి మహదేవ్‌ని ఆరోగ్యవంతుడిని చేయకపోదా? అన్నట్టు శూన్యంలోకి చూస్తున్న మనస్విని ..... వీళ్ళని వదిలేసి తను తన మానాన వెళ్ళిపోతాడు.

వెళ్ళిపోయాక ..... తనిని వీళ్ళ జ్ఞాపకాలు వదిలివేస్తాయా? లేదు ..... తన కట్టె చితిలో భస్మమై పోయినా ఆత్మలో నిశ్శబ్దంగా ముద్రించుకుపోయిన వీళ్ళ జ్ఞాపకాలు తనలోనే వుండిపోతాయి. ముఖ్యంగా జాలిగా చూసే ఆ కళ్ళు ..... మనస్విని! అవి తనకి జన్మజన్మలకూ గుర్తుండిపోతాయి. అవును జన్మజన్మలకీ తన ఆత్మ మరిచిపోలేనివి కళ్ళూ, అందులోని గూడు కట్టుకున్న విషాదమూను."

స్స ..... క్క ..... స్స ..... గ్గ ..... ర్ర ..... స్స ..... మనే మూలుగుతో అక్కడున్న అందరూ ఆలోచనలలోనుంచి బయటపడి మహదేవ్ వంక పరీక్షగా చూశారు.

ఊపిరి అందక ఆపసోపాలు పడుతున్నాడతను. అభిరాం కింద పడిపోకుండా మహదేవ్‌ని గట్టిగా అదిమి పట్టుకున్నాడు. వరప్రసాదం డాక్టర్ కోసం వేగంగా బయటికి నడిచాడు.

"మహదేవ్! ఏమైంది?" అంటూ అతని గుండెలపై నిమురుతూ ఆందోళనగా అడుగుతోంది మనస్విని.

స్స ..... క్ ..... స్స ..... క్క ..... గ్ ..... హా ..... స్సిక్ ..... క్ ..... గు ..... గింగిరీలు తిరిగిపోతూ అవస్థపడిపోతున్నాడతను.

తిరుపతి పరిశీలనగా అటే చూస్తూ నిలబడ్డాడు. వరప్రసాదం, డాక్టర్ హడావుడిగా ఆ గదిలోకి వచ్చారు. మహదేవ్‌ని పరీక్షగా చూసిన డాక్టర్ గట్టిగా అరిచాడు .....

"సిస్టర్!" అంటూ. అతడెంత గట్టిగా అరిచాడంటే అతడి అరుపు పూర్తయిన మరుక్షణం సిస్టర్ అక్కడికొచ్చేసింది- బిత్తరపోతూ.

"ఆక్సిజన్!" ఆమె కనిపించిన వెంటనే ఆర్డర్ పాస్ చేశాడతను. మరుక్షణం మహదేవ్ ముక్కుకు అమర్చిన ఆక్సిజన్ ట్యూబ్ కృత్రిమంగా అతనికి శ్వాసనందిస్తోంది. మెల్లమెల్లగా మహదేవ్ గొంతు నుంచి వచ్చిన గురక ఆగిపోయింది. డాక్టర్ అతని పల్స్ చూశాడు. క్రమంగా పల్స్ తగ్గిపోతోంది. హృదయచలనాన్ని పరీక్షించాడు. "లబ్ ..... డబ్!"

"లబ్ ..... డబ్" మంటూ గుండె కొట్టుకునే వేగంలో చాలా తేడా వచ్చేసి, లీలగా విన్పిస్తోంది.

"ఇది న్యూమోనియా కాదు! ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టుకుపోవటం. అందుకే ఇతనికి శ్వాస అందలేదు" తనలో తానే అనుకున్నాడు.

మరుక్షణం రక్తాన్ని కరిగించి, మామూలుగా అయ్యేందుకు 'హెపరిన్' ఇంజక్షన్ యిచ్చాడు. కానీ దీనివల్ల రక్తస్రావం జరిగే ప్రమాదం కూడా వుంది. అందుకే ముందుచూపుగా అతనికి బ్లడ్ ఎక్కించటానికి కూడా ఏర్పాట్లు జరిగిపోయాయి.

ఈ తతంగమంతా గమనించిన మనస్విని ఎవరినీ ఏమీ అడగలేదు. జరుగుతున్న కార్యక్రమాన్నంతా మౌనంగా చూస్తుండిపోయింది. అది నిర్వేదం!

ఏడ్చి మొత్తుకుని హృదయంలో భారాన్ని దించేసుకోకుండా- ఊహించని ఉపద్రవానికి గుండెలోనే ఆశ్రయం కల్పిస్తూ మౌనంగా వుండిపోవడం అనే ఈ ఫీలింగ్ అన్నింటికంటే ప్రమాదకరమైంది. గాలి ఎక్కువై పేలిన బుడగలా ఏ క్షణంలోనైనా గుండె అగ్నిపర్వతంలా పేలితునాతునకలైపోతుంది.

"చెయ్యాలి! ఏదైనా ప్రయత్నం చెయ్యాలి ..... అతడు మరణించే లోపు! ఏ ప్రయత్నమూ చెయ్యకుండా గాలిలోని దీపం ఆరిపోకూడదని ఆ భగవంతుణ్ని ప్రార్థించేకంటే శక్తి వున్నంతవరకూ, కనీసం అరచేతిని అడ్డుగా పెట్టయినా దీపం ఆరిపోకుండా ప్రయత్నిస్తూ తర్వాత ఆ పైవాడిని ప్రార్థిస్తే ఫలితం వుంటుంది" అనుకున్నాడు తిరుపతి.

అదే క్షణంలో వరప్రసాదం అతనివంక చూశాడు.

"ఇతన్ని బ్రతికించే ఉపాయం చెప్పరూ! అదెంతటి కష్టమైనదైనా చేస్తాం. దయచేసి చెప్పండి" అన్నట్టున్నాయి ఆ చూపులు.

స్టాండ్‌కి తలకిందులుగా వేలాడుతున్న ఫ్లూయిడ్స్‌లోంచి పడుతున్న ఒక్కోచుక్క సన్నని గొట్టంలోంచి మహదేవ్ శరీరంలోకి అతని చేతిగుండా ప్రవేశించటాన్ని గమనిస్తున్నాడు

అభిరాం.

కిటికీలోంచి కన్పిస్తున్న నీలాకాశంలోకి చూపులు నిలిపి మాటాపలుకూ లేకుండా మౌనంగా వుండిపోయింది మనస్విని.

ఒక్క నిమిషం వరప్రసాదం వైపే చూస్తూవుండిపోయాడు తిరుపతి. తర్వాత ఆ గదిలోని ఓ మూలకి నడిచి కళ్ళు మూసుకుని కుర్చున్నాడు.

అప్పుడతన్ని చూస్తే తపస్సులో వున్న ఋషీశ్వరుడు జ్ఞాపకం వస్తున్నాడు వరప్రసాదానికి.

అతనికి ఎంతో సంతోషం వేసింది.

"దొరుకుతుంది ..... మహదేవ్‌ని బతికించుకునే మార్గం దొరుకుతుంది. తిరుపతి తప్పక కనుక్కోగలడు."

తనకెవరితోనూ సంబంధం లేదన్నట్లు కాలచక్రం ముందుకు తిరుగుతూనే వుంది.

*   *   *   *   *

అప్పటికి తిరుపతి ధ్యానంలో కూర్చుని ఆరుగంటలవుతోంది. నిశ్చలంగా వుండిపోయాడతను. ఒకే ఒక్క ఆలోచన ..... మహదేవ్‌ని రక్షించగల మహిమాన్వితుడెక్కడున్నాడు? బుద్ధిని యోగంతో సంధానం చేసి అపరిమితమైన దీక్షతో ధ్యానం గావిస్తున్నాడతను.

అభిరాం ఏదో అనబోయాడు.

"మాట్లాడవద్దు" అన్నట్టు సైగచేశాడు వరప్రసాదం. అతనికర్థం కాలేదు. "దేనికి" అన్నట్టు చూశాడు వరప్రసాదం వైపు తిరిగి. మౌనంగా ఆ గదిలోని ఓ మూలకి చూపించాడు అతను. అటు చూసి బిత్తరపోయాడు అభిరాం. సాయంత్రం నుంచీ ఎటూ కదలకపోవటంతో అతను తిరుపతిని చూడలేదు.

అతని మాటలు విన్పించకపోవటం, మనిషి కనిపించకపోవటంతో సాయత్రమే గోదావరికి వెళ్ళిపోయాడేమో అనుకుంటున్నాడతడింకా.

తిరుపతి తదేక ధ్యానంతో కదలకుండా అంతసేపు అలా వుండిపోవటం అతడికి ఆశ్చర్యం కలిగించింది. వరప్రసాదం ఇంతకుముందే అటువంటివన్నీ చూసి వుండటంతో కొత్తగా ఏమీ అన్పించలేదతనికి.

*   *   *   *   *

తూర్పునుంచి వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి .....

పక్షుల కిలకిలా రావాలు భగవంతుడు తమకి ప్రసాదించిన మరో ఉదయానికి కృతజ్ఞతలు అందజేస్తున్నట్టుగా వున్నాయి.

కళ్ళు మూసుకుని ధ్యానంలో వున్న తిరుపతికి క్రమక్రమంగా చీకటి పలచబడి ఏవో దృశ్యాలు మనోఫలకానికి అందుతున్న భావన .....

అటువంటి సమయంలోనే యోగులూ, ఋషులూ మరింత సమన్వయం పాటించాలి.

కనీకనిపించని ఆ దృశ్యం ఏమిటా అని ఆలోచించకూడదు. దానితో వారు దేనికోసమని ముందు ధ్యానం మొదలుపెట్టారో ఆ తదేక దీక్ష అంతమైపోయి కొత్త సందేహాలతో మళ్ళీ మొదటికొస్తారు. ఆ విషయం అతనికి తెలుసు! అందుకే ఆ దృశ్యాలు పూర్తిగా, తనకి అవగతమయ్యేవరకూ అతడు ధ్యానంనుంచి మనసుని మరెటూ చలించకుండా జాగ్రత్తపడ్డాడు.

అభిరాం, మనస్విని, వరప్రసాదం ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

అదే సమయంలో - ఏదో వాహనంలో కూర్చుని చూస్తుంటే చెట్లూ, చేమలూ, అడవులు, పొలాలూ వేగంగా వెనక్కి వెళ్ళిపోతున్నట్లు తిరుపతి మనోఫలకం మీద దృశ్యాలు వెనక్కి కదలసాగాయి.

వేగమంటే సామాన్యమైన వేగం కాదు. వాయువేగ, మనోవేగాలకి సమానమైన వేగం ..... క్షణక్షణానికీ మరింతగా పెరుగుతూ!

ఉన్నట్టుండి అతని శరీరం చిన్నగా కదలసాగింది. అప్పుడే పట్టుతప్పి ఏకాగ్రత సడలిపోతుంది. ఇరవై ఏళ్ళనుంచి యోగం అనుభవమే అయిన తిరుపతి శరీరం చలిస్తున్నా - మనస్సు మాత్రం చలించనివ్వలేదు.

కోరుకున్న గమ్యస్థానం చేరుకుంటున్నట్టు క్రమేపి అతని మనోనేత్రం ముందు వేగంగా కదిలిన దృశ్యాలు నెమ్మదించాయి. మరికొద్దిసేపటికి శరీరమంతా చల్లగా వున్న భావన ..... రానురాను ఆ చలి మరింత ఎక్కువవుతోంది ..... శరీరం చలికి తట్టుకోలేనట్టు చిన్నగా కంపిస్తుండగా అతనికో దృశ్యం కనిపించింది.

ధవళ కాంతులీనుతూ ప్రకృతి మెరిసిపోతోంది. మబ్బుల్ని చీల్చుకుని వచ్చిన సూర్యుడు లక్షలాది రంగుల్ని ప్రసరిస్తున్నట్టు వివిధ వర్ణాలు తళుక్కుమని మెరుపులు మెరిపిస్తున్నాయి.

చిరునవ్వుతో అతిధికి స్వాగతం పలుకుతున్నట్టు లిల్లీ, ఆర్చిడ్స్, నీలికాంతులీనుతున్న కమలం మరెన్నో రకాలైన పుష్పాలు కనిపించాయి.

ఎటు చూసినా తెల్లని గుట్టలు, ఎత్తయిన శిఖరాలు కనిపించాయి. మనోనేత్రం ముందుకు సాగుతోంది ..... మెల్లగా! ఎత్తయిన ఓక్, పైన్, దేవదారు వృక్షాలు క్షణం కనిపించి వెనక్కి పోతున్నాయి.

మనోనేత్రం కదలటం ఆగిపోయినట్టు ఒకే ఒక దృశ్యం కనిపిస్తోంది. అదొక గుహలా వుంది. లోపలికి పడుతున్న ఒక సూర్యకిరణం మసక వెలుతురుని ప్రసరిస్తోంది.

ఆ గుహలో ఒక ఎత్తయిన రాయి వంటిది కనిపిస్తోంది. దానిమీద కూర్చుని వున్న వ్యక్తి స్పష్టంగా కనిపించటంలేదు.